సాక్షి తిరుపతి

శుక్రవారం । 10 । మార్చి । 2023



తిరుపతి బులియన్


బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.56,940
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,086

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.63,600
రిటైల్ వెండి గ్రాము	రూ.65.60

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	18
చిత్తూరు	34	18
తిరుమల	30	14
గూడూరు	34	21
నగరి	35	19



శరవే'గంగ' నిర్మాణం

తిరుపతి కల్చరల్: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నిర్ణీత సమయానికి ఆలయ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు ముమ్మరం చేశారు.

న్యూస్‌రీల్

3, 4 తేదీల్లో మెక్ - అరేన 2కే23



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 3, 4 తేదీల్లో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మెక్ - అరేన 2కే23 పేరుతో జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవ్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను గురువారం మహిళా వర్సిటీలో ప్రొఫెసర్ మల్లికార్జున, డాక్టర్ పీ.స్నేహలత, ఆర్.భాస్కర్‌రెడ్డి, డాక్టర్ జే.వెంకటేశునాయక్, పీ.నీరజ, ఎల్.శ్రీలేఖ ఆవిష్కరించారు.

ఏనుగుల గుంపు వీరంగం



పొలంలో ఏనుగుల అడుగులు

పాకాల: మండలంలో ఏనుగల గుంపు వీరంగం సృష్టించింది. మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ పరిధిలో రాత్రి సమయాల్లో సుమారు ఐదు ఏనుగులు పంట పొలాలపై పడి సర్వనాశనం చేశాయి. బుధవారం రాత్రి పంచాయతీ పరిధిలోని చుక్కా శ్రీనివాసులు, చుక్కా హరిబాబు, దాసన్నగారి వెంకటస్వామి, శ్రీరాములు, పాండుకు చెందిన వరి, అరటి, కొబ్బరి, మామిడి తోట్లను ధ్వంసం చేశాయి. దాదాపు నాలుగు ఎకరాల మేర పంట పొలాలు పాడయ్యాయని, నాలుగు లక్షల రూపాయల పంట నష్టం వాటిల్లినట్టు రైతులు వాపోయారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవడానికి వీలుగా రెవెన్యూ డివిజన్ పరిధిలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి తోపాటు శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ అధికారులు స్వీయ పర్యవేక్షణలో ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఉద్యోగస్తులు శుక్రవారం సాయంత్రం 4గంటల్లోపు రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద సంప్రదించాలని ఆయన సూచించారు.

17, 18 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈ నెల 17, 18 తేదీల్లో కంప్యూటింగ్, కమ్యూనికేషన్, డేటా ఇంజినీరింగ్‌పై 4వ అంతర్జాతీయ సదస్సు (సీసీఓడీఈ-2023), అలాగే జాతీయ స్థాయి స్టూడెంట్స్ టెక్ ఫెస్ట్ (ఆస్పైర్ 2.0 రైజింగ్ ట్యాలెంట్స్)ను నిర్వహించనున్నారు. వీటికి సంబంధించిన బ్రోచర్లను వర్సిటీలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజని మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సుకు దేశవిదేశాల నుంచి పలు విశ్వవిద్యాలయాలు, ప్రముఖ ఐటీ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్‌లో పేపర్, పోస్టర్ ప్రజంటేషన్లు, క్విజ్, గేమింగ్‌తో పాటు పలు రకాల కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పీ.వెంకటకృష్ణ, ప్రొఫెసర్ ఎం.ఉషారాణి, డాక్టర్ ఎస్‌వీ.ముత్తులక్ష్మి పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి విశేష పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ట చేసి వినాయకపూజ, కలశ పూజ, పలు వైదిక క్రతువులను నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జ్వరం.. వద్దు భయం

- తిరుపతి నగరంలోని ఎంఆర్‌పల్లి సర్కిల్‌లో నివాసముంటున్న భాను(పేరుమార్చాం)కు ఇటీవల తీవ్ర జ్వరం వచ్చింది. స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడి వైద్యులు రక్తపరీక్షలు చేసి వైరల్ ఫీవర్‌గా నిర్ధారించారు. మందులు, మాత్రలకు రూ.1,300 దాకా ఖర్చయింది. వారం రోజుల తర్వాత జ్వరం నయం కాగా దగ్గు, గొంతు నొప్పి, ఒళ్లునొప్పులు అలానే ఉన్నాయి.
- చిత్తూరు మండలానికి చెందిన స్వప్న (పేరు మార్చాం) పది రోజుల క్రితం జ్వరంతో చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యింది. మూడు రోజుల పాటు దాక్టర్లు మెరుగైన చికిత్స అందించారు. కాస్త ఆరోగ్యం కుదటపడగానే డిశ్చార్జ్ చేశారు. ఇప్పుడు ఆ మహిళ కాస్త గొంతు నొప్పితో ఇబ్బంది పడుతోంది.

.. ఇవి రెండే కాదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి కేసులు కోకొల్లలు. ఇటీవల వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతోపాటు నీటి కాలుష్యం, దోమల బెడద కారణంగా వైరల్ జ్వరాలు చుట్టుముడుతున్నాయి. రోజుల తరబడి తగ్గకపోవడంతో ఒకింత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రులకు క్యూకడుతున్నారు.




చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో క్యూలో వేచి ఉన్న రోగులు

జిల్లాలో ఫ్లూ వైరస్ కంగారుపెడుతోంది. దగ్గు, జలుబు, జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. చిన్నారులు, వృద్ధుల్లో తీవ్రత అధికంగా కనిపిస్తోంది. ఆస్పత్రులకు జనం క్యూకడుతున్నారు. రోజూ 700లకు పైగా జ్వరాల కేసులు వస్తున్నాయి. ఇందుకు వాతావరణ పరిస్థితులు ఒక కారణమైతే.. మరో వైపు కొత్తరకం ఫ్లూ వైరస్‌గా వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫ్లూయిడ్స్ అధికంగా తీసుకోవడంతోపాటు వైద్యులను సంప్రదించకుండా ఇష్టానుసారం మందులు వాడొద్దని ఐసీఎంఆర్ సూచించింది.

- చిన్నారులు, వృద్ధుల్లో వైరస్ తీవ్రత
- కిక్కిరిస్తున్న ఆస్పత్రులు
- వారానికి పైగా తగ్గని దగ్గు, ఒళ్లు నొప్పులు
- అప్రమత్తమైన వైద్యఆరోగ్యశాఖ
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు



చికిత్స చేస్తున్న డాక్టర్లు



ఫీవర్ వివరాలు

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులు	158
ప్రవేటు ఆస్పత్రులు	482
ఆర్ఎంపీ క్లినిక్‌లు	2 వేలకు పైనే

తిరుపతి జిల్లాలో..		చిత్తూరు జిల్లాలో..	
తేదీ	జ్వరాల సంఖ్య	తేదీ	జ్వరాల సంఖ్య
2	781	2	675
3	704	3	524
4	644	4	581
5	738	5	613
6	566	6	691
7	761	7	571

సాక్షి, తిరుపతి/ చిత్తూరు రూరల్: జిల్లాకు జలుబు, దగ్గు, జ్వరం పట్టింది. ప్రస్తుతం ప్రతి ఐదుగురిలో ఒకరికి జ్వరం, దగ్గు, గొంతు నొప్పి లక్షణాలు కనిపిస్తున్నాయి. వాతావరణంలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వేసవి మొదలైనా రాత్రి నుంచి ఉద యం వరకు చలి వణుకు పుట్టిస్తోంది. కుప్పం, వి.కో ట, పలమనేరు, పుంగనూరు, చిత్తూరు సరిహద్దు ప్రాంతాల్లో చలి తీవ్రత తగ్గడం లేదు. కనిష్టంగా 19 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఈ కారణంగా జ్వరం, దగ్గు, జలుబు, శ్వాస సంబంధిత వ్యాధులు పెరు గుతున్నాయి. దీనికి కొత్తరకం వైరస్ తోడైందని.. ఇన్‌ఫ్లుయెంజా-ఏ ఉపరకంలో హెచ్3 ఎన్ 2 వైరస్ కారణమని వైద్యులు అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక జిల్లా ఆస్పత్రి , మూడు ఏరియా ఆస్పత్రులు, 7 సీహెచ్‌సీలు, 50 పీహెచ్‌సీలు ఉన్నాయి. 2 వేలకు పైగా ప్రైవేటు ఆస్పత్రులు ఉండగా.. వీటి పరిధిలో రోజూ దగ్గు, జలుబు, శ్వాస సంబంధిత కేసులు 700 వరకు వస్తున్నాయి. ఈ కేసులను పరీక్షించగా సీజనల్ ప్రభావంతో పాటు ఫ్లూ వ్యాప్తి చెందుతున్నట్లు వైద్యులు నిర్ధారిస్తున్నారు. వైరల్ ఫీవర్ బాధిత రోగులతో ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. చిన్నపిల్లలకు సంబంధించిన ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతు న్నాయి. చాలా మందిలో అవి తీవ్రంగా... ఉంటున్నాయి. కొందరిలో కొన్ని రోజుల తరువాత న్యు మోనియాగా మారి శ్వాసకోశ ఇబ్బందులకు గురిచేస్తోంది.

లక్షణాలు..

ఫ్లూ వైరస్ బారినపడుతున్న వారిలో ఎక్కువగా తీవ్రమైన దగ్గు, జలుబు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, కొందరిలో అధిక జ్వరం వస్తోంది. మరికొందరిలో తీవ్రమైన శ్వాస సంబంధిత సమస్యలకు ఈ వైరస్ కారణమవుతోంది. వైద్యుల వద్దకు వెళ్లినా, మందులు వాడుతున్నా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదంటున్నారు. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీఎంఆర్ సూచించింది. ఫ్లూయిడ్స్ అధికంగా తీసుకోవడంతోపాటు వైద్యులను సంప్రదించకుండా ఇష్టానుసారం మందులు వాడొద్దని సూచించింది. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్లాత్ అడ్డంగా పెట్టుకోవాలని, లక్షణాలు ఉన్నవారు పిల్లలు, వృద్ధులకు దూరంగా ఉండాలని పేర్కొంది. జ్వరం, ఒళ్లు నొప్పులకు పారాసిట్మాల్ వినియోగించాలని, ఇబ్బంది ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించింది. చిన్నారుల్లో ఈ సమస్య కొంత ఎక్కువగా కనిపిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఫ్లూ ఇన్ఫెక్షన్ సాధారణంగా వారం నుంచి పది రోజులు ఉంటుంది. దగ్గు మూడు వారాల వరకు ఉంటుంది. 15 ఏళ్ల లోపు పిల్లలు, 50 ఏళ్లు పైబడిన వారు ఈ ఇన్ఫెక్షన్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువ. వాయు కాలుష్యం కూడా కేసుల పెరుగుదలకు కారణమవుతోందని వైద్యులు చెబుతున్నారు. అయితే వ్యాధితీవ్రత ఎక్కువగా ఉన్నా భయపడాల్సిన పనిలేదని అంటున్నారు.

జాగ్రత్తలు ఇలా..

- ఫ్లూ లక్షణాలు ఉన్నవాళ్లు ఇతరులతో కరచాలనం, ఆలింగనం, దగ్గరగా కూర్చోవడం, కలిసి భోజనం చేయకూడదు
- లక్షణాలున్న వాళ్లు బహిరంగ ప్రదేశాలలో ఉమ్మి వేయకూడదు
- సొంత వైద్యం వీడి వైద్యుడి సూచనల మేరకు మందులు వాడాలి
- బహిరంగ ప్రదేశాల్లో, సమూహాల్లో ఉన్నప్పుడు విధిగా మాస్కులు ధరించాలి
- తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి
- నోరు, ముక్కును పదే పదే తాకరాదు
- దగ్గుతున్నప్పుడు, ముక్కు కారుతున్నప్పుడు గుడ్డను ఉపయోగించాలి
- వ్యాధి నిరోధక శక్తి పెంచే ఆహారం తీసుకోవాలి

అప్రమత్తంగా ఉండాలి



"జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, ఒళ్లనొప్పులు తదితర కేసులు అధికంగా వస్తున్నాయి. వైరస్ వ్యాప్తి అధికంగా ఉంది. ఇలాంటి సమయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. చిన్నారులు, వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ వైరస్ న్యుమోనియా బారినపడేలా చేస్తోంది. భయపడాల్సిన పనిలేదు. బయటకు వెళ్లినప్పుడు మాస్క్ ధరించాలి. పౌష్టికాహారం ఆహారం తీసుకోవాలి. చల్లని పానీయాలు, బయటి ఆహారాలకు కొంత దూరం ఉండాలి.

– రవిరాజు, డీఐఓ

యాంటీ బయాటిక్స్ వాడొద్దు



ఫ్లూ జ్వరాలకు భయపడాల్సిన అవసరం లేదు. వైద్యులను సంప్రదించి తగిన మాత్రలు, మందులు వాడాలి. వారం నుంచి పదిరోజుల లోపు లక్షణాలు తగ్గుతాయి. జ్వరం తగ్గలేదని మెడికల్ షాపులను ఆశ్రయించవద్దు. తొందరగా జ్వరం తగ్గుతుందని.. యాంటీ బయాటిక్స్ వాడకూడదు. మరోవైపు ఇన్‌ఫెక్షన్‌లను నిర్ధారించుకోకుండా రోగులకు యాంటీ బయాటిక్స్ సూచించకూడదని ఐసీఎంఆర్ హెచ్చరించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

– టీఎస్‌కే నాయక్, డీసీహెచ్ఎస్, చిత్తూరు

నేడు తొండవాడలో వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సభ



వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నియోజకవర్గ నాయకులు



ఆత్మీయ సభ కోసం తొండవాడలో సిద్ధమవుతున్న మైదానం

- నియోజకవర్గ నలుమూలల నుంచి తరలిరానున్న జనం
- బహిరంగ సభా స్థలిలో 40వేల మందికి సరిపడా ఏర్పాట్లు
- చెర్లోపల్లి నుంచి 2వేల బైక్‌లతో భారీ ర్యాలీకి సన్నద్ధం

చంద్రగిరి: ప్రజల సంక్షేమం.. పల్లెల్లో జరిగిన అభివృద్ధి పనులే కాదు ప్రజల ఆనందం, కష్టాల్లో సైతం అండగా నిలబడి సాయం చేస్తూ ప్రజల హృదయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తలపెట్టిన వైఎస్సార్‌సీపీ ఆత్మీయసభకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం మండల పరిధిలోని తొండవాడ జాతీయ రహదారికి సమీపంలో భారీ భహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇప్పటికే నియోజకవర్గ నాయకులు అందుకు తగిన ఏర్పాట్లను పూర్తిచేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఈ సభకు సుమారు 40వేల మందికిపైగా తరలిరానున్న నేపథ్యంలో అందుకుతగిన ఏర్పాట్లు చేపడుతున్నారు. తొండవాడ గ్రామానికి ఇరువైపులా పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు. సభాస్థలి వరకు భారీ వాహనాలను అనుమతించకుండా పోలీసులు కట్టడి చేసి వాహనాలు అన్నింటినీ నిర్దేశించిన పార్కింగ్ స్థలాల్లో నిలిపేలా చర్యలు చేపట్టారు. తిరుపతి రూరల్ మండలం, చెర్లోపల్లి కూడలి నుంచి పుదిపట్ల, పెరుమాళ్లపల్లి, సి.మల్లవరం, కాలూరు, తొండవాడ, చంద్రగిరి పట్టణం, నాగాలమ్మ కూడలి మీదుగా జాతీయ రహదారి నుంచి తొండవాడ వద్ద జరిగే సభా స్థలి వరకు 2వేల ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీ నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు అధికారులు తగిన చర్యలు చేపట్టారు. పార్టీలకతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆత్మీయ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ పార్టీ నాయకులు కోరారు.

ప్రత్యేక గ్యాలరీల ఏర్పాటు

సభకు హాజరయ్యే ప్రజల సౌకర్యార్థం నాయకులు ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 15 గ్యాలరీలను ఏర్పాటు చేసి, ప్రజలు కుర్చీల్లో కూర్చుని ప్రసంగాలను వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా ప్రతిఒక్కరూ ఆత్మీయ సభను వీక్షించే విధంగా డిజిటల్ ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

6 ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలు

ఆత్మీయ సభకు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు పార్కింగ్ కేంద్రాలను నిర్దేశించారు. ఇందులో తొండవాడ-2, శానంబట్ల మార్గంలో-2, సభస్థలి సమీపంలో మరో రెండు పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎక్కడ దిగిన ప్రజలు అక్కడి నుంచే కాలినడకన సభా స్థలికి చేరుకునేలా చర్యలు చేపట్టారు.

స్విమ్స్‌లో ఘనంగా ప్రపంచ కిడ్నీ దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ

తిరుపతి కల్చరల్: నెఫ్రాలజీ విభాగం ఆధ్వర్యంలో స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, పెరిటోనియల్ డయాలసిస్ చేసుకుంటున్న చిన్న పిల్లలచేత జ్యోతి ప్రజ్వలచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్విమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే స్విమ్స్‌లో చిన్నపిల్లలకు పెరిటోనియల్ దయాలసిస్‌ను రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా మార్చి రెండవ గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. పెరిటోనియ్ డయాలసిస్ చేసుకునే వారు మంచి ప్రొటీన్లు, విటమిన్లు, కార్బొహైడ్రేట్లతో కూడిన ఆహారం తీసుకుంటూ తక్కువ పరిణామంలో ఉప్పును తీసుకోవాలని సూచించారు. డాక్టర్ల సూచనల మేరకు తగిన మోతాదులో మందులు వాడాలని, లేని పక్షంలో కిడ్నీ వ్యాధి వస్తుందన్నారు. వేసవిలో నీళ్లు ఎక్కువ తాగాలని సూచించారు. హైపవర్ టెన్షన్‌ను, బ్లడ్ షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలని చెప్పారు. స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, నెఫ్రాలజీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కొత్త అంశాలను నేర్చుకొని ఆచరించడం ద్వారా అందరం ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. సంవత్సరానికి ఒకసారి టెస్టులు చేసుకోవంతో ముందుగానే కిడ్నీ సమస్యల భారినపడకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పెరిటోనియల్ డయాలసిస్ చేసుకుంటున్న పిల్లలతో డాక్టర్ వెంగమ్మ పరిచయ కార్యక్రమం అనంతరం వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నెఫ్రాలజీ విభాగం వైద్యులు, వివిధ విభాగాధిపతులు, ఎంఎస్‌డబ్ల్యూ ప్రసాద్, సిబ్బంది, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో అరుదైన కాన్పు



క్షేమంగా ఉన్న తల్లీబిడ్డతో వైద్య బృందం

- తల్లీబిడ్డ క్షేమం

తిరుపతి తుడా: స్థానిక ప్రసూతి ఆస్పత్రిలో వైద్యుల బృందం అరుదైన కాన్పు చేసి తల్లీబిడ్డను రక్షించారు. చిత్తూరు జిల్లా, గంగాధరనెల్లూరుకు చెందిన గర్భిణి ఏ.కుమారి (52) మూడు నెలలుగా ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారు. బహిష్టు ఆగిన దశలో చెన్నైలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ఐవీఎఫ్ ద్వారా ఆమె గర్భం దాల్చారు. అక్కడ ఖర్చు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను తిరుపతి ప్రసూతి ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె డయాబెటిస్, రక్తపోటు, మిక్స్‌డ్ కనెక్టివ్ టిష్యూ డిజార్డర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆమెకు కాన్పు చేయడం వైద్యులకు సవాల్‌గా మారింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి సూచనలు మేరకు ప్రసూతి విభాగాధిపతి డాక్టర్ కె.మాధవి ఆధ్వర్యంలో మెరుగైన చికిత్స అందించారు. సుమారు మూడు లక్షలకు పైగా ఖర్చయ్యే చికిత్సను డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందిచారు. బుధవారం అర్ధరాత్రి ఆమెకు అత్యవసర సిజేరిన్ ద్వారా ప్రసవం చేసి తల్లీబిడ్డ ప్రాణాలు కాపాడారు. వైద్యం అందించిన వారిలో డాక్టర్ బాలాజీనాయక్, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ప్రశాంత వాతావరణం

తిరుపతి అర్బన్: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. జిల్లా నుంచి కలెక్టర్, డీఆర్వో శ్రీనివాసరావు హాజరయ్యారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

తిరుపతి అర్బన్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన నులిపురుగుల నివారణ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న సాకులు చూపించి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 14వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అనంతరం నులిపురుగుల నిర్మూలనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, డీఈఓ వీ.శేఖర్, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారి జయలక్ష్మి, ఎస్వీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్, డీఎల్‌డీఓ సుశీలాదేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శాంతకుమారి పాల్గొన్నారు.

25న మిక్స్‌డ్ బియ్యం టెండర్ కం వేలం

తిరుపతి అలిపిరి: తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాలకు హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన బియ్యాన్ని మార్చి 25వ తేదీన టెండర్, వేలం వేయనున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇందులో మిక్స్‌డ్ బియ్యం 11,640 కిలోలు టెండర్, వేలంలో ఉంచనున్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 25వ తేదీలోపు కార్యనిర్వహణాధికారి, టీటీడీ పేరిట రూ.2,500 డీడీ తీసి సీల్డ్ టెండర్‌తోపాటు తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం , జనరల్ మేనేజర్ (వేలం) కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. అదేరోజు సాయంత్రం టెండర్లను తెరవనున్నట్లు టీటీడీ పేర్కొంది. ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429 నంబర్లలో సంప్రదించాలని సూచించింది.

జిల్లాకు చేరిన ఇంటర్ పాఠ్యపుస్తకాలు

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరాయి. రాష్ట్ర మోడల్ స్కూల్ కార్యాలయం నుంచి పుస్తకాలను సరఫరా చేశారు. జిల్లాలోని మోడల్ స్కూళ్లలో వచ్చే ఏడాది ఇంటర్మీడియట్ విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. జిల్లాకు చేరిన పుస్తకాలను ప్రత్యేకంగా గోడౌన్‌లో భద్రపరిచారు. ఈ కసరత్తును డీఈఓ విజయేంద్రరావు పర్యవేక్షించారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



వాకాడు: మండంలోని వాలమేడు గ్రామ సమీపంలో గురువారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందింది. వాలమేడు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ గాయం శ్రీనివాసులు మాట్లాడుతూ వాలమేడు సమీపంలోని ఫారెస్టు నుంచి దాహమేయడంతో బయటకు వచ్చిన చుక్కల దుప్పిని కుక్కలు చుట్టుముట్టి దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయన్నారు. అనంతరం చికిత్స చేసినా ఫలితం లేకపోయిందన్నారు. మృతి చెందిన చుక్కల దుప్పిని ఫారెస్టు నిబంధనల ప్రకారం కననం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పారిశ్రామిక విప్లవానికి నాంది

- జగనన్న బ్రాండ్ ఇమేజ్‌తోనే గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ విజయవంతం
- పర్యాటక రంగంలో రూ.21,941 కోట్ల పెట్టుబడులు
- కామెంట్ చేసిన వారికి ఈ పెట్టుబడులే సమాధానం
- నేత ఉత్పత్తిదారుల సమావేశంలో మంత్రి ఆర్కే రోజా



నేత ఉత్పత్తిదారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా

నగరి : విశాఖపట్నంలో ఈనెల 3, 4 తేదీల్లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడం రాష్ట్ర పారిశ్రామిక విప్లవానికి నాంది అని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతకు, చిత్తశుద్ధికి నిదర్శనమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. గురువారం నగరి మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పంలో నేత ఉత్పత్తిదారులతో ఆమె సమావేశమయ్యారు. నేత రంగంలో నెలకొంటున్న మార్పులపై చర్చించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశ్రామికంగా రాష్ట్రం ముందడుగు వేస్తోందన్నారు. సీఎం జగనన్న బ్రాండ్ ఇమేజ్ వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు ప్రవాహంలా వస్తున్నాయన్నారు. పర్యాటక రంగానికి రూ.21,941 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి 129 ఎంఓయూలు చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం 41,500 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయన్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్తాన్, కర్ణాటకల్లో జరిగిన పెట్టుబడుల సదస్సుల్లో కూడా పర్యాటక రంగానికి సంబంధించి ఇంత భారీస్థాయిలో పెట్టుబడులు రాలేదన్నారు. సీఎం జగనన్న విజన్ ఏంటో ఇప్పుడు అందరికీ అర్థమైందన్నారు. 6 లక్షల మందికి ఉద్యోగాలు రావడం చిన్న విషయం కాదన్నారు. ప్రతిపక్షాలు చేసే దిగజారుడు రాజకీయాలు పక్కన పెట్టి పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారన్నారు.

వారికి ఈ పెట్టుబడులే సమాధానం..

రోజమ్మ టూరిజం మినిస్టరా ? టూరిస్టా అని ఎగతాళి చేసిన వారికి పర్యాటక రంగానికి వచ్చే రూ.21,941 కోట్ల పెట్టుబడులే సమాధానం అన్నారు. పిచ్చుకలంక, గండికోట, తిరుపతి, హార్సిలీహిల్స్, విశాఖపట్నంలో టూరిజం అభివృద్ధికి రూ. 1,350 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. తూర్పు గోదావరిలో రూ.వెయ్యి కోట్ల వ్యయంతో డెస్టినేషన్ టూరిజం ప్రాజెక్ట్ ఏర్పాటు కానుందని తెలిపారు. విజయవాడలో భవానీ ఐలాండ్‌కు, ఈగలపెంట నుంచి శ్రీశైలానికి, కోట్టప్పకొండలో ఇప్పుడున్న ఆలయం నుంచి స్వయంభు ఆలయానికి, శ్రీకాళహస్తిలో ఆలయానికి రోప్‌వేలు వేయనున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలో బీచ్ పాయింట్‌లో రిషికొండ బీచ్ వరకు రూ.1,250 కోట్లతో, విశాఖలో వెయ్యి కోట్లతో గోల్ఫ్‌హౌస్, విల్లాస్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. అలాగే రూ.1000 కోట్లతో సఫారీ టూరిజం ప్రాజెక్టు రానుందన్నారు. తిరుపతి, బాపట్ల, విశాఖపట్నంలో రూ.1000 కోట్లతో 7 స్టార్ హోటళ్ల నిర్మాణానికి ఎంఓయూలు సిద్ధమయ్యాయని చెప్పారు. ఏడాదిలోపు వీటిని పూర్తి చేసి జగనన్న విశ్వసనీయత ఏంటో తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, చిత్తూరు జిల్లా నేత అనుబంధ సంఘం అధ్యక్షుడు కన్నాయిరం, వైఎస్సార్‌సీపీ నగరి మున్సిపల్ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, పురుషోత్తం, కౌన్సిలర్లు భూపాలన్, మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్షంలో అద్భుతాలను కనుగొనే స్థాయికి శాస్త్ర విజ్ఞానం

- ఎంబీయూలో సైన్స్ ఫర్ ప్లానెట్స్ వెల్-బీయింగ్
- హాజరైన కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్



డాక్టర్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న వీసీ నాగరాజ, రామారావు తదితరులు

చంద్రగిరి: అంతరిక్షంలో మనిషికి ఉపయోగపడేవి కనుగొనే స్థాయికి నేడు శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందిందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం మోహన్‌బాబు యూనివర్సిటీ, ఇన్నోవేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ ఫర్ ప్లానెట్స్ వెల్-బీయింగ్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఔషధాలు, వ్యాక్సిన్, వ్యవసాయ రంగంలో ఎంతో ప్రగతిని సాధించినట్లు వివరించారు. గ్రహాల వివరాలు, కొత్త గ్రహాలను కొనుక్కోవడం, అవి మనకు ఎలా ఉపయోగపడతాయనే విషయాలను విద్యార్థులకు కూలంకషంగా తెలిపారు. భూమిలోనే కాకుండా ప్రయోగశాలలో సైతం ఆహారాన్ని ఉత్పత్తి చేయడం విజయవంతంగా తెలుసుకున్నామన్నారు. తిరుపతి ఇన్నోవేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య నారాయణరావు మాట్లాడుతూ 40 సంవత్సరాల క్రితం వరకు భారతదేశం వ్యాక్సిన్ కోసం అందరిదగ్గర చెయ్యి చాచే పరిస్థితిలో ఉండేదని, కానీ ఇప్పుడు ప్రపంచానికే ఉచితంగా వ్యాక్సిన్ అందించే స్థాయికి ఎదిగిందని తెలిపారు. సంస్థ గౌరవ కార్యదర్శి డాక్టర్ టి.నారాయణరావు పాల్గొని గ్రహరాశుల గురించి వివరించారు. అనంతరం కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ కార్యదర్శిని ఎంబీయూ వీసీ నాగరాజ రామారావు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. యూనివర్సిటీ వీసీ నాగరాజ రామారావుతో పాటు రిజిస్ట్రార్ సారథి, ఎంబీయూ అనుబంధ కళాశాల ప్రిన్సిపాళ్లు, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ కనకనరసారెడ్డి, హాజరైన సిబ్బంది

తిరుపతి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని తిరుపతి ఆర్డీఓ కనకనరసారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో తిరుపతి డివిజన్ పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఇతరపోలింగ్ సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 12వ తేదీ ఉదయం 8 గంటలకు శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు సిబ్బంది హాజరు కావాలని, అదే రోజు పోలింగ్‌కు సంబంధించిన సామగ్రిని అందిస్తామని తెలిపారు. తిరుపతి డివిజన్‌కు సంబంధించి పట్టభద్రుల నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలు 29, ఓటర్లు 37,899, ఉపాధ్యాయ నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలు 12, ఓటర్లు 3083 ఉన్నట్టు తెలిపారు. పీఓలు, ఏపీఓలు, తహసీల్దార్ కార్యాలయాల్లో డమ్మీ బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయని, సీల్ వేయడంతోపాటు తీసుకోవాల్సిన అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

జాతర విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ తదితరులు

గూడూరు: కనుపూరు ముత్యాలమ్మ జాతరను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డీఎస్పీ సూర్యానారాయణరెడ్డి తదితరులతో కలసి, అన్ని శాఖల అధికారులతో ఆయన గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడు వెంటనే రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అలాగే జారత విషయమై శుక్రవారం నుంచి జాతర పూర్తయ్యే వరకూ అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షిస్తామని ఆర్డీఓ తెలిపారు. తాగునీటి సౌకర్యంతోపాటు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా, అన్ని చర్య లు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించా రు. అనంతరం ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న ముత్యాలమ్మ జాతర పోస్టర్‌ను ఆయన అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో ఈఈ ఇస్మాల్, ఏడీ ప్రసాద్, ఈఓ నవీన్‌కుమార్, అగ్నిమాపక శాఖాధికారి చలమయ్య, ఎస్‌ఐ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

14న పోలేరమ్మ జాతర మొదటి చాటింపు



పెద్దకాపు శ్రీనివాసులు రెడ్డికి తాంబూళం ఇస్తున్న ఆలయ చైర్మన్, నాయకులు

నాయుడుపేటటౌన్: గ్రామదేవత పోలేరమ్మ జాతర నిర్వహణకు ఈ నెల 14న మొదటి చాటింపు వేయనున్నట్లు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి పాయశం శాంతరావు, ఆలయ చైర్మన్ గంధవళ్లి సిద్ధయ్య తెలిపారు. పాయశం శాంతరావు, ఆలయ చైర్మన్ గంధవళ్లి సిద్ధయ్య, నల్లబోతుల రామారావు గురువారం విన్నమాల గ్రామంలో ఉన్న పోలేరమ్మ ఆలయ పెదకాపు ఆరవభూమి శ్రీనివాసులురెడ్డి నివాసానికి వెళ్లి ఆయనకు సంప్రదాయబద్ధంగా తాంబూళం అందజేశారు. అనంతరం దేవదాయ శాఖ అధికారులతోపాటు ఆలయ చైర్మన్ సిద్ధయ్య, నల్లబోతుల రామారావు, ఆకుల కుబేరు మణి, రాగి శేషగిరి తదితరులు పెదకాపుతోపాటు కలిసి వెళ్లి, విన్నమాల గ్రామపెద్దలకు తాంబూళం అందించి, జాతర వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, ఈఓ మాట్లాడుతూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో ఆలయపాలక మండలి సభ్యులు, గ్రామపెద్దలతో కలసి, పోలేరమ్మ అమ్మవారి జాతర వేడుకలను వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మొదటి చాటింపు ఈ నెల 14న వేసి, జాతరను మే నెల 1,2,3 తేదీల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు .ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ బీఎల్ శ్రీనివాసులు, ఆలయ ట్రస్టీ సభ్యులు దేవత కిషోర్‌శెట్టి, పసల హరి బాబు, ముద్దపాటి శ్రీకాంత్, కంపా జమున, వైఎస్సార్‌సీపీ నాయకులు గంధవళ్లి భరత్, రాయపు శేఖర్, గుంటూరు ప్రమోద్,ఆలయ పూజారి ముని సురేష్, బేరిపేట యువత, విన్నమాల గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం



రథంలో ఊరేగుతున్న అలఘునాథస్వామి

గూడూరు: పట్టణంలోని అలఘునాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి రథోత్సవం కనులపండువగా జరిగింది. స్వామి, అమ్మవారితో కలిసి రథంపై పుర వీధుల్లో ఊరేగారు. రథాన్ని లాగేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు కూడళ్లలో రథంపై ఊరేగుతున్న స్వామి వారికి ఆ ప్రాంత వాసులు నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నృసింహుని సేవలో గుంటూరు రేంజ్ డీఐజీ



డీఐజీ త్రివిక్రమ్‌వర్మకు తీర్థప్రసాదాలు అందిస్తున్న దేవస్థాన అధికారులు

రాపూరు: శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామిని గురువారం నెల్లూరు జిల్లా ఎస్పీ విజయరావుతో కలిసి గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమ్‌వర్మ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్ చెన్నుతిరుపాల్‌రెడ్డి, ఈఓ జనార్దన్‌రెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. స్వామివారి దర్శనానంతరం పండితులు ఆశీర్వచనాలు అందించగా ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. వారివెంట ఏఎస్పీ హిమవతి, ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి, రాపూరు సీఐ కోటేశ్వరావు, ఎస్‌ఐ క్రాంతికుమార్ ఉన్నారు.

ముక్కంటీశునికి లాకర్ వితరణ



లాకర్ అందజేస్తున్న సునీల్

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన సునీల్ బంగారు దుకాణ నిర్వాహకులు సునీల్ శ్రీకాళహస్తీశ్వరాలయానికి స్వామి, అమ్మవార్ల బంగారు నగలు భద్రపరచుకునేందుకు లాకర్‌ను గురువారం వితరణగా అందజేశారు. దీనిని పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ స్వామి అమ్మవార్ల బంగారు నగలను భద్రపరచే లాకర్ పాతబడడంతో దాని స్థానంలో కొత్తది కావాల్సి ఉందని, ఈ తరుణంలో సునీల్ బంగారు నగల దుకాణం యజమానిని సంప్రదించగా ఆయన స్పందించారని తెలిపారు. అనంతరం వారికి స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేయించారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో పండితులు ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామి,అమ్మవార్ల జ్ఞాపిక, ప్రసాదాలు అందజేశారు. బంగారు వ్యాపారులు అనిల్, ధర్మచంద్, మనీష్, రాకేష్, ప్రవీణ్, ఆలయ అభిషేక గురుకుల్ రాజేష్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

11 మంది బైండోవర్



స్టేట్‌మెంట్ తీసుకుంటున్న డీటీ శివయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు తావులేకుండా ముందస్తుగా 11 మందిని ఎస్‌ఐ మంజునాథరెడ్డి గురువారం బైండోవర్ చేసుకున్నారు. వీరిని డిప్యూటీ తహసీల్దారు శివయ్య వద్ద హాజరుపరిచారు. ఎన్నికల్లో ఎలాంటి గొడవలు చేయమని బైండోవర్ చేసిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు హామీ ఇచ్చారు. దీంతో వారి వద్ద స్టేట్‌మెంట్ తీసుకుని వదిలేశారు.

మహిళ ఆత్మహత్య

గూడూరు: రైలు కిందపడి వితంతు మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధీనగర్ ప్రాంతంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. పట్టణ సమీపంలోని గాంధీనగర్ ప్రాంతంలో అదేప్రాంతానికి చెందిన రేవతి (50) గూడూరు- తిరుపతి రైలు మార్గంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు. ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదు.

పూరిల్లు దగ్ధం



కేవీబీపురం: షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైన ఘటన కేవీబీపురం మండలంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుల కథనం.. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పిడుగు ధయాకర్, సోలమ్మ పూరింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న ఫ్రిజ్, టీవీ, ఫ్యాన్లతోపాటు ఏడు సవర్ల బంగారు, వెండి ఆభరణాలు, రూ.30 వేల నగదు కాలి బూడిదయ్యాయి. నాలుగు లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ బాధితులను పరామర్శించారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.





శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్టుమెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 61,921 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 23,141 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.68 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. టోకెట్లు లేని వారికి 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అట్రాసిటీ కేసులో ఒకరికి రిమాండ్

తిరుపతి లీగల్: ఓ వ్యక్తిపై మారణాయుధంతో దాడిచేయడమే కాకుండా అతనిని కులంపేరుతో దూషించిన కేసులో తిరుపతి కొర్లగుంటకు చెందిన సయ్యద్‌మీర్‌కు 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 5వ తేదీ తిరుపతి రూరల్ పద్మావతీపురం జెడ్పీ హైస్కూల్ వద్ద నిందితుడు మీర్ తిరుపతి రూరల్ పేరూరు విద్యానగర్‌కు చెందిన వై.ప్రణీత్‌పై మారణాయుధంతో దాడిచేసి కులంపేరుతో దూషించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుచానూరు పోలీసులు కేసు దర్యాప్తు చేసి సయ్యద్‌మీర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

ఎన్నికల కేంద్రం పరిశీలన

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులోని ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాన్ని మండల తహసీల్దార్ హనుమాన్‌నాయక్ గురువారం పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లను తనిఖీ చేశారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్లకు పంపిణీ చేసిన స్లిప్పులపై సిబ్బందితో చర్చించారు.









